గడప గడపకు సంక్షేమ ఫలాలు

• నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



రాపూరు: గడప గడపలో నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

రాపూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలను గడప గడపకు చేరవేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. రాపూరులో రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ రామ్‌కుమార్‌రెడ్డి వెళ్లి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రంలోని పేదల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతోందన్నారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపించాలని ఆయ కోరారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు సంఘ కార్యదర్శి బత్తిన పట్టాభిరామిరెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ పాపకన్ను దయాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, సర్పంచ్ జయమ్మ, తిరుపతి జిల్లా మైనార్టీ విభాగ కార్యదర్శి డాక్టర్ ఖాదర్‌బాషా. వైఎస్సార్‌సీపీ నేతలు మేడా సునీల్‌కుమార్‌రెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, పిచ్చిరెడ్డి, అల్తాఫ్, గౌస్‌పీర్, గని, గుండురాఘవయ్య, వెంకటసుబ్బయ్య, రత్నాకర్‌రెడ్డి, ఆరీఫా, కోటేశ్వరరెడ్డి, రమణయ్య, రమణారెడ్డి, జయరామయ్య పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న నేదురుమల్లి

పకడ్బందీగా ఓటింగ్ ప్రక్రియ

–ఈవీఎం, ఓటింగ్ ప్రక్రియలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

వెంకటగిరిరూరల్: రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఓటింగ్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సాంబశివరావు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వివిధ రాజకీయ పార్టీల నేతలకు ఈవీఎం మిషన్లపై అవగాహన కల్పించారు. ఓటు ఎలా వేయాలి, ఈవీఎం పనిచేసే విధానంపై డెమో నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఓటింగ్ సమయంలో ఎక్కడ కూడా అవాంఛనీయ సంఘటనలు లేకుండా ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ రోజున వివిధ రాజకీయ పార్టీ ఏజెంట్ల సమక్షంలో ముందుగా 50 మాక్ పోలింగ్ నిర్వహిస్తామని అనంతరం సీఆర్‌సీ చేసిన తరువాత సాధారణ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందన్నారు. ఈమేరకు ప్రతి బూత్ సెంటర్‌లో ఓటింగ్‌పై గ్రామస్తులకు, రాజకీయ నాయకులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డక్కిలి, రాపూరు, సైదాపురం తహసీల్దార్‌లు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై ప్రజావేదిక



ఉపాధి ప్రజావేదికలో అధికారులు

వాకాడు: మండలంలో 2022 నుంచి 2023 ఏడాది వరకు జరిగిన ఉపాధి పనుల్లో రూ.25,500 వేలు అవకతవకలు జరిగినట్లు తనిఖీ బృందాలు గుర్తించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని 19 పంచాయతీలలో ఉపాధి పథకం ద్వారా 284 పనులకుగాను రూ.7.11 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని అన్నారు. అందులో రూ.4.73 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. అయితే ఖర్చు జరిగిన పనుల్లో రూ.25,500 అవకతవకలు జరిగినట్లు పీడీ తెలిపారు. అందులో రూ.9,378 రికవరీ చేశామన్నారు. అలాగే సచివాలయ భవనాల అభివృద్ధి కోసం రూ.2.12 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఎంపీడీఓ తోట గోపీనాథ్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియో విజయవంతం



రాపూరులో పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది



దీవీసత్రం: ఇటుక బట్టీల వద్ద పోలియో చుక్కలు వేస్తున్న సిబ్బంది

రాపూరు: మండలంలో మూడు రోజులపాటు నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమం విజయవంతంగా నిర్వహించినట్లు వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యురాలు ప్రమీలరాణి తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండులో మంగళవారం చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలో 4,674 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు చెప్పారు.

డీవీ సత్రంలో వంద శాతం

దొరవారిసత్రం: దొరవారిసత్రం, తొగరాముడి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో పల్స్ పోలియో వంద శాతం పూర్తిచేసినట్లు వైద్యాధికారులు చైతన్య, తరుణ్ తెలిపారు. మంగళవారం ఇంటింటికీ సిబ్బంది వెళ్లి చిన్నపిల్లలకు పోలియో చుక్కలు వేసినట్లు వారు పేర్కొన్నారు.

ఆపద్బాంధవునిలా వలంటీర్

–వైద్యశాలకు వెళ్లి పింఛన్ అందజేత

వెంకటగిరిరూరల్: ఆపదలో ఉన్న వారికి వలంటీర్ల వ్యవస్థ ఆపద్బాంధవునిలా ఆదుకుంటోంది. పట్టణంలోని 17వ వార్డుకు చెందిన రొంటాల ధనమ్మ అనారోగ్యానికి గురై తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ పూజారి యోగ్యశ్రీ స్విమ్స్‌కు వెళ్లి ధనమ్మకు పింఛన్ పంపిణీ చేశారు. అదేవిధంగా పట్టణంలోని సాలికాలనీ సచివాలయం పరిధికి చెందిన అవ్వరు లక్ష్మమ్మ తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతోంది. వలంటీర్ భరత్ తిరుపతికి వెళ్లి పింఛన్ పంపిణీ చేశారు.

నెల్లూరుకు వెళ్లి..

గూడూరురూరల్: పట్టణంలోని తిలక్ నగర్‌కు చెందిన నగరెడ్డి వెంకటసుబ్బయ్య వృద్ధాప్య పింఛన్ అందుకుంటున్నాడు. ఇటీవల ప్రమాదానికి గురై కాలు విరిగి నెల్లూరులోని బంధువుల ఇంట్లో ఆశ్రయం పొందుతున్నాడు. వలంటీర్ కొండా సౌజన్య మంగళవారం నెల్లూరుకు వెళ్లి పింఛన్ అందజేసింది.



తిరుపతిలో లక్ష్మమ్మకు పింఛన్ ఇస్తున్న భరత్



నెల్లూరులో పింఛన్ ఇస్తున్న సౌజన్య



స్విమ్స్‌లో పింఛన్ ఇస్తున్న యోగ్యశ్రీ

విజ్ఞానం పెంపొందించుకోవాలి

చిల్లకూరు: మూఢ నమ్మకాలను విడనాడి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని దంత వైద్యనిపుణులు ఊసా నారాయణ విద్యార్థులకు సూచించారు. చింతవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులు సైన్సు నమూనాలను ఏర్పాటు చేశారు. సైన్సు నమూనాలను తయారు చేసిన విద్యార్థులకు ఈసందర్భంగా బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం శివసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మల్లె సాగుపై అవగాహన

కోట: కేసవరంలో మంగళవారం మల్లె సాగుపై రైతులకు సేవ్ ది చిల్డ్రన్, రక్షాభారత్ సంస్థల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేసవరం, రాఘవాపురం, మద్దాలి, కొండుగుంట గ్రామాల్లో మల్లె సాగు చేపట్టే రైతులు అధికంగా ఉన్నారు. వారికి పూలసాగులో ఆధునిక పద్ధతులు, మార్కెటింగ్ సదుపాయాలపై అవగాహన కలిగించారు. సర్పంచ్ క్రిష్ణస్వాతి, హార్టికల్చర్ అసిస్టెంట్ కార్తీక్, అనిల్‌కుమార్, సేవ్ ది చిల్డ్రన్ సూపర్‌వైజర్ పాపారావు పాల్గొన్నారు.

నేడు సచివాలయాల భవనాలు ప్రారంభం

కలువాయి: మండలంలో నూతనంగా నిర్మించిన నాలుగు సచివాలయ భవనాలను తిరుపతి ఎంపీ ఎం.గురుమూర్తి, తిరుపతి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు బి.అనిల్‌కుమార్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు కలువాయి–1, కలువాయి–2 సచివాలయ భవనాలను, మధ్యాహ్నం 2 గంటలకు తెలుగురాయపురం, 3 గంటలకు చినగోపవరం సచివాలయ భవనాలను వారు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

కండలేరులో 9.734 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 9.734 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 600 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 10, హైలెవల్ కాలువకు 103, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

మాజీ ఉప రాష్ట్రపతికి స్వాగతం




వెంకయ్యనాయుడుకు స్వాగతం పలుకుతున్న అధికారులు, బీజేపీ నేతలు

గూడూరురూరల్: భారత దేశ మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు రైలులో ప్రయాణిస్తూ గూడూరు రైల్వేస్టేషన్లో దిగడంతో అధికారులు, బీజేపీ నేతలు ఆయనకు స్వాగతం పలికారు. తిరుపతి నుంచి నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం రాత్రి ఆయన ప్రయాణిస్తూ గూడూరు రైల్వేస్టేషన్‌లో దిగారు. విషయం తెలిసి గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, బీజేపీ నేతలు వెంకయ్యనాయుడుకు పుష్పగుచ్ఛాలు అందించి శాలువలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో వెంకటాచలంలోని స్వర్ణభారత్ ట్రస్టుకు వెళ్లారు.

అన్నపూర్ణ వరి బాగుంది

చిల్లకూరు: నూతన వంగడాలలో అన్నపూర్ణ వరి రకం బాగా ఉందని చిల్లకూరు వ్యవసాయశాఖాధికారిణి గూడూరు భవాని తెలిపారు. చిల్లకూరులో నందవరం సుబ్బారావు అనే రైతు తెలంగాణకు చెందిన అన్నపూర్ణ అనే వరి విత్తనాలను తీసుకొచ్చి సాగు చేపట్టారు. ఇది బాగా ఏపుగా పెరిగి పిలకలు కూడా బాగా పెట్టి దుబ్బులు ఎక్కువగా వచ్చాయి. ఈ విషయాన్ని గుర్తించిన ఏఓ రైతు ద్వారా ఎలాంటి మందులు ఉపయోగిస్తున్నారు అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. చిల్లకూరు వీఏఏ శివకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపాలి



మాట్లాడుతున్న రవిచంద్ర

వాకాడు: ప్రకృతి వ్యవసాయంపై ప్రతిఒక్కరూ ఆసక్తి చూపాలని జిల్లా ప్రకృతి వ్యవసాయం యాంకర్ రవిచంద్ర కోరారు. ఆయన మండల సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం ఆయన మండల సమాఖ్య సంస్థను రైతు సాధికార సంస్థతో సమన్వయం చేసి సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు.

బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ

వెంకటగిరి(సైదాపురం): విద్యార్థులు విద్యార్థి దశ నుంచే బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీఓ శంషాద్‌బేగం పేర్కొన్నారు. పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో బేటీ బచావో, బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ తులసిజ్యోతి, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ విజయశ్రీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కల్పలత, ఏఎన్‌ఎం వాణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

తడ: జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందింది. రామాపురం కుప్పం వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు హైవే పెట్రోలింగ్ సిబ్బంది సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటన స్థలానికి చేరుకుని మృతురాలి వయసు 65 ఏళ్లు ఉంటాయని గుర్తించారు. రహదారి వెంట నడుచుకుంటూ వెళుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఆమెను ఢీకొట్టి ఉంటుందని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మంగళవారం పంచనామా నిర్వహించారు.

ప్రతి ఎకరానికి సాగునీరందిస్తాం



గంగ జలాలను విడుదల చేస్తున్న డీసీసీబీ చైర్మన్

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో ప్రతి ఎకరానికి సాగునీరు అందించి రైతులను ఆదుకుంటున్నట్లు నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం 7వ బ్రాంచ్ తెలుగుగంగ కాలువ గుండా చెంబేడు, పునబాక, రోసనూరు గ్రామాల చెరువులకు గంగ జలాలను సత్యనారాయణరెడ్డి చేతుల మీదుగా విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రైతులందరూ మరోమారు ఆశీర్వదించాలన్నారు. నేతలు మోహన్, రవిరెడ్డి, మునిరాజ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం



దాతలను సన్మానిస్తున్న హనుమంతరావు

రాపూరు: రాపూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు దాతల సహకారంతో మధ్యాహ్నం భోజన వసతి కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ నెల్లూరు కు చెందిన ఆదర్శ కృష్ణమూర్తి మంగళవారం రూ.15 వేలు విలువ చేసే వంట సామగ్రి వితరణగా అందించినట్లు తెలిపారు. అలాగే నెల్లూరు లయన్స్ క్లబ్ నిర్వాహకులు తమ క్లబ్ తరఫున సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారని తెలిపారు. దాత కృష్ణమూర్తిని ఘనంగా సన్మానించారు. అధ్యాపకుడు వసంతరావు ,విద్యార్థులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న రాజ్యలక్ష్మి

వాకాడు: గొల్లపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి తండ్రి పాపారెడ్డి సుబ్రమణ్యంరెడ్డి మంగళవారం మృతి చెందారు. మాజీ మంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పూర్నాటి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్‌శేఖర్‌రెడ్డి ఉన్నారు.

13న మున్సిపల్ వేలం పాటలు

వెంకటగిరి(సైదాపురం): వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలోని 2024–25వ సంవత్సరానికి సంబంధించిన మున్సిపాలిటీ పరిధిలోని కూరగాయల మార్కెట్, మున్సిపల్ సరిహద్దులోని రోడ్డు మార్జిన్లు, అమ్మవారిపేట చేపల మార్కెట్, చేపలు, మాంసం మార్కెట్, బజారువీధి, జంతువధ శాల హక్కుల వేలం పాటలు సంబంధించి ఈనెల 13న వెంకటగిరి మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అబ్దుల్‌రషీద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొనదలచిన వారు నిర్ణయించిన ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చునని మున్సిపల్ కమిషనర్ పేర్కొన్నారు.

విద్యార్థులు ఇష్టంగా చదువుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ శివకుమార్

సైదాపురం: ప్రతి విద్యార్థి ఇష్టంగా చదువుకుంటే ఉన్నత స్థాయిలో రాణిస్తారని ఎంపీడీఓ కార్యాలయ ఏఓ పురుషోత్తం శివకుమార్ అన్నారు. మంగళవారం ఊటుకూరు ఉన్నత పాఠశాలలో సరస్వతీ పూజ నిర్వహించారు. రిటైర్డ్ వేణుగోపాల్‌రావు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు టీవీఎల్ నారాయణరావు, టీచర్లు పాల్గొన్నారు.

గూడూరు పురపాలక సంఘము

బహిరంగ వేలము ప్రకటన

గూడూరు పురపాలక సంఘమునకు సంబంధించిన కూరగాయల మార్కెట్ మరియు చేపల మార్కెట్ల ఆర్థిక సంవత్సరము **2024–25** గాను **తేది. 01.04.2024 నుండి 31.03.2025** వరకు కూరగాయల మార్కెట్ మరియు చేపల మార్కెట్‌లలో దినసరి రుసుము వసూలు చేసుకొను లీజు హక్కులకు **తేది. 14.03.2024 ఉదయము గం.11.00 లకు** గూడూరు పురపాలక సంఘ కార్యాలయములో కమీషనరు గారిచే గాని లేక వారి అనుమతి పొందిన వారిచే గాని ఈ క్రింద చూపబడిన మార్కెట్లకు బహిరంగ వేలము నిర్వహించబడును.

క్రమసంఖ్య	మార్కెట్ పేరు	ధరావత్తు	సాల్వెన్సీ సర్టిఫికేట్
1	కూరగాయల మార్కెట్	3,00,000/-	10,00,000/-
2	చేపల మార్కెట్	30,000/-	2,00,000/-

చేపల మార్కెట్ వేలము నందు మత్స్యకార సంఘముల వారు గాని అందులో సభ్యత్వమున్న వారు మాత్రమే పాల్గొనవలెను.

వేలము పాటలో పాల్గొనదలచిన వారు ముందుగా పై తెలిపిన విధముగా ధరావత్తు సొమ్ము, సాల్వెన్సీ సర్టిఫికేట్‌లను పురపాలక సంఘ కార్యాలయము నందు దాఖలుపరచవలెను. స్థిరాస్తి విషయంలో రెవెన్యూ శాఖలోని డిప్యూటి తహసీల్దారు హోదాకు తక్కువ కానీ అధికారి, మునిసిపల్ పరిధిలోని ఆస్తి విషయములో కమీషనరు వారు జారీ చేసిన సర్టిఫికేట్ అయి ఉండవలెను. **తేది 13.03.2024 సాయంత్రము 5.00 గం॥ లోపుగా సాల్వెన్సీ సర్టిఫికేట్లు** ఎ1 గుమస్తాకు అందజేయవలెను. సమయము దాటిన తరువాత స్వీకరించబడవు. నిర్ణీత తేది మరియు సమయం లోపున సాల్వెన్సీ సమర్పించిన వారు మాత్రమే **తేది.14.03.2024న** తగు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనుటకు అనుమతించబడును.

ఎటువంటి కారణములు తెలుపకనే వేలము పాట తేదీలను మార్పు/ రద్దు చేయుటకు ఎగ్జిక్యూటివ్ అథారిటీ వారికి అధికారము గలదు. మిగిలిన నియమ నిబంధనల కొరకు ఎ1 గుమస్తా గారిని కార్యాలయ పనివేళల యందు సంప్రదించవచ్చును.

కమీషనరు, గూడూరు పురపాలక సంఘం

క్లుప్తంగా

మిషన్ అమృత్ సరోవర్‌కు ప్రాధాన్యం



కడివేడులో పనులు తనిఖీ చేస్తున్న పీడీ

చిల్లకూరు: గ్రామాల్లో ఉపాధి పథకం కింద చేపడుతున్న మిషన్ అమృత్ సరోవర్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. కడివేడు రెవెన్యూ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి పథకంలోని మిషన్ అమృత్ సరోవర్ పనులను మంగళవారం డ్వామా పీడీ తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి మొదలైన కారణంగా ఉపాధి పనుల ప్రాంతాల్లో నిబంధనలు కచ్చితంగా పాటించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఏపీఓ గిరిబాబు, ఈసీ మల్లికార్జున్, టెక్నికల్ అసిస్టెంట్లు క్రిష్ణ, శ్రీను, సీఎల్‌ఆర్‌సీ ఏపీడీ చంద్రశేఖర్‌రావు ఉన్నారు.

అర్హులకు పథకాలు అందాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఓజిలి: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈఓపీఆర్డీ మోహన్ పాల్గొన్నారు.

విలేకరి వేధింపులపై పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్: పట్టణానికి చెందిన ఓ పత్రికా విలేకరి (సాక్షి కాదు) ఉపాధ్యాయులపై అసత్య కథనాలతో పీడీఎఫ్ కటింగ్‌లు పెడుతూ తరచూ వేధింపులకు పాల్పడుతున్నట్లు పలు ఉపాధ్యాయ సంఘ నాయకులు ఆరోపించారు. ఈ మేరకు మంగళవారం ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో పాటు పలువురు ఉపాధ్యాయిన్లను బ్లాక్ మెయిల్ చేసి వేధిస్తున్నట్లు సీఐ శ్రీనివాసరెడ్డి దృష్టికి తెచ్చారు. సీఐని కలిసి ఫిర్యాదు చేసిన వారిలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు కె..సుబ్బారావు, బీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు పి. రామకృష్ణ, ఆర్‌యూపీపీ జిల్లా గౌరవ అధ్యక్షుడు జి. వెంకటేశ్వర్లు, యూటీఎఫ్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఐద్వా మహిళా నాయకురాలు చంద్రకళ ఉన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

డక్కిలి (బాలాయపల్లి): బాల్య వివాహాలు చేయడం చట్ట రీత్యా నేరమని వెంకటగిరి ఐసీడీఎస్ సీడీపీఓ శంషాద్ బేగం తెలిపారు. సంగవరం గిరిజన కాలనీలో మంగళవారం బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ బాల్యవివాహాలు నిర్మూలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టిందన్నారు. బేటీ బచావో.. బేటీ పడావో (ఆడ పిల్లలను రక్షించండి. ఆడ పిల్లలకు చదువు చెప్పండి) అనే నినాదంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఆమె తెలిపారు. ఎక్కడైనా బాల్య వివాహాలు చేస్తుంటే 1098 హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని ఆమె పేర్కొన్నారు. ఆడపిల్లలను బాగా చదివించాలని సూచించారు. చిన్న వయస్సులో వివాహం చేస్తే రూ.లక్ష జరిమానా, రెండేళ్ల జైలు శిక్ష విధిస్తామన్నారు.

ఆలయాల్లో వేలం పాటలు

చిల్లకూరు: తూర్పుకనుపూరులోని ముత్యాలమ్మ ఆలయం, కలవకొండలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పలు హక్కులకు చెందిన వేలం పాటలను మంగళవారం దేవదాయశాఖాధికారుల సమక్షంలో నిర్వహించారు. ముత్యాలమ్మ ఆలయంలో ఏప్రిల్ 1 నుంచి జరగనున్న జాతర సందర్భంగా కొబ్బరికాయలు విక్రయం, వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన హక్కుల వేలం పాటలను నిర్వహించారు. కొబ్బరి చిప్పల హక్కుల వేలం పాటను మాత్రం వాయిదా వేస్తున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే కలవకొండలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కొబ్బరికాయలు ఏడాది పాటు విక్రయించుకునే హక్కుతో పాటు ఆలయానికి చెందిన 25 ఎకరాల మెట్ట భూమికి కౌలుకు వేలం పాటలను నిర్వహించారు. 25 ఎకరాలను ఏడాదికి రూ 3.29 లక్షల చొప్పున ఐదు సంవత్సరాలకుగాను పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ముత్యాలమ్మ ఆలయ ఈఓ నవీన్ కుమార్, కలవకొండ ఈఓ తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

సైదాపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఈవీఎంలపై బీఎల్‌ఓ, సెక్టార్ అధికారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డీటీ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.